క్లుప్తంగా

సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వేపదారు శివలింగానికి నదీజలాలతో అభిషేకం చేస్తున్న పురోహితులు

కొత్తపల్లి: సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయంలో సంగమేశ్వరుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయపు రోహితులు తెలపల్లి రఘురామ శర్మ వేపదారు శివలింగానికి నదిజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, వేదమంత్రాలతో విశేషపూజలు చేపట్టారు. వేసవి సెలవులు ఉండడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు సందర్శకులు స్వామివారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు.

బి.కోడూరులో ఉరుసు



ఉత్సవాలకు ముస్తాబైన తిక్కఖాసీం దర్గా

మహానంది: బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలోని ఖుద్దహు తిక్కఖాసీం వారి ఉరుసు మహోత్సవం బుధవారం ప్రారంభమయ్యింది. బుధవారం రాత్రి గంధం, గురువారం ఉరుసు వేడుకలు ఉంటాయని గ్రామపెద్దలు చెప్పారు. ఈ మేరకు గ్రామంలోని కేసీ కెనాల్ కాలువ వద్ద ఉన్న దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇప్పటికే గ్రామంలో ఉరుసు మహోత్సవం సందర్భంగా బంధుమిత్రుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది.

వేసవి విజ్ఞాన శిబిరం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం లైబ్రేరియన్ కౌసల్య ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆటపాటలు, వివిధ రకాల పుస్తకాల పఠనం చేయించారు. నీతి కథలు, పాటలు పాడించారు.

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

మహానంది: నంద్యాల–మహానంది రహదారిలోని తమ్మడపల్లె మలుపు సమీపంలోని ఇంజవాణి చెరువు వద్ద బుధవారం ఓ కారు బోల్తా పడింది. వికారాబాద్‌కు చెందిన రాజేంద్ర్ మిత్రబృందం మహానందికి వచ్చి స్వామి దర్శనాతరం తిరుగుప్రయాణంలో నంద్యాల వైపు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదకర మలుపుల వద్ద కుక్కలు అడ్డుగా రావడంతో తప్పించబోయి బ్రేక్ వేయగా అదుపు తప్పి కంపచెట్లలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు సాయమందించి కారును యథాస్థితికి చేర్చడంతో వారు ప్రయాణం కొనసాగించారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీ

వెలుగోడు: పట్టణంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సమాచారం మేరకు బుధవారం విజిలెన్స్ సీఐ నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలో సోదాలు నిర్వహించగా వెల్పనూరు రహదారిలోని హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. 280 ప్యాకెట్ల బియ్యంతో పాటు లారీ, ఐచర్ వాహనాలను స్వాధీనం చేసుకొని ఖలీల్, మాలిక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పల్లెల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నూతన కల్వర్టు నిర్మాణం



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నూతన కల్వర్టు నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు సర్పంచు వరప్రసాద్, వైఎస్ఆర్ సీపీ నాయకులు రామలింగేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలోని ముస్లిం మైనార్టీ కాలనీలో నిర్మాణం చేపట్టనున్న కల్వర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం సామాజిక వర్గం ప్రజలు, అటు వైపు పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరడం, ఇరుకుగా ఉండటంతో చాలా ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. దీంతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో కల్వర్టు నిర్మానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఇందులో భాగంగా కాల్వలో నీటిని తొలగించినట్లు వెల్లడించారు.

అనుమతుల్లేవంటూ ఆపేశారు!

- బానుముక్కల– బానకచెర్ల రహదారి మరమ్మతులకు రూ.1.50 కోట్లు మంజూరు
- పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్
- రహదారి పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు
- కంకర రోడ్డుపై ప్రయాణికుల ఇక్కట్లు
- పాత రహదారికి మరమ్మతులను అడ్డుకోవడంపై ప్రజల విమర్శలు



పనులను అడ్డుకోవడంతో నలిచిన రహదారి నిర్మాణం



కొంత వరకు నిర్మాణం చేపట్టిన బీటీ రహదారి

పాములపాడు: రహదారులు అభివృద్ధికి సోపానాలు. పట్టణాలకు పల్లెలకు వారధులు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యతనిస్తూ వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని బానుముక్కల– బానకచెర్ల గ్రామాల మధ్య బీటీ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే అనుమతులు లేవంటూ అటవీశాఖ అధికారులు మధ్యలోనే పనులు నిలిపివేడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రూ.1.50 కోట్లతో రహదారి పనులు

మండలంలోని బానుముక్కల– బానకచెర్ల గ్రామాల మధ్యన రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఉన్న రహదారి పూర్తిగా గుంతల మయం కావడంతో ప్రభుత్వం బానుముక్కల నుంచి వేంపెంట మజరా సుంకులమ్మ కొట్టాల గ్రామం వరకు 6కిలో మీటర్ల మేర రహదారి పనులకు అగ్రికల్చర్ మేంటిన్ కమిటీ నిధులు రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో గుత్తేదారు ఇప్పటికే పూర్తిగా కంకర వేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. పాతరోడ్డును పెకిలించి కొత్తరోడ్డు కోసం కంకర వేశారు. అడవీ పరిధిలో దాదాపు 1.5కిలో మీటర్ల మేర ఈ రహదారి ఉండటంతో రోడ్డు నిర్మాణానికి అనుమతుల్లేవని వారం రోజుల క్రితం అటవీశాఖ అధికారులు పనులు నిలిపివేశారు. మళ్లీ అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చే వరకు నిర్మాణ పనులు ముందుకుసాగే అవకాశం లేదు.

ఎక్కడికి వెళ్లాలన్నా ఈ రహదారే దిక్కు..

ఈ రహదారి మండలంలోని వేంపెంట, బానకచెర్లతో పాటు మజరా గ్రామాలకు కీలకం. వారు వెలుగోడు, పాములపాడు, ఆత్మకూరు, నంద్యాల వెళ్లాలంటే ఈ రోడ్డే దిక్కు. పనులు ఆగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు కంకర రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అడవికి దగ్గరగా మా గ్రామాలుండటమే శాపమా అని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30 ఏళ్ల క్రితమే రహదారి నిర్మాణం..

ఈ రహదారి దాదాపు 30 సంవత్సరాల క్రితం నిర్మించారని, ఇప్పుడు నిర్మాణ పనులను ఎలా అడ్డుకుంటారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది నూతన నిర్మాణం కాదుకదా, గతంలో నిర్మాణం చేపట్టిన రహదారే కదా, అప్పట్లో అనుమతులు లేకుండానే నిర్మాణం జరిగిందా, పూర్వం బండ్ల రస్తాను క్రమేపి బీటీ రహదారులను ప్రభుత్వాలు చేపట్టాయని గుర్తు చేశారు. అనుమతులు లేకుండా పనులు అప్పుడు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నిస్తున్నారు.

ఇదెక్కడి న్యాయం



రోడ్డు పనులు జరుగుతుంటే అడవీశాఖ అధికారులు అడ్డుకోవడం ఇదెక్కడి న్యాయం. ప్రజల సంక్షేమం కోరి, ప్రయాణాలకు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం రోడ్డు వేస్తుంటే పనులు నిలిపివేయడం సరైందికాదు. రోడ్డు నిర్మాణ పనులు జరగనివ్వాలి.
–ఓబన్నగౌడు, బానకచెర్ల

కంకర రోడ్డుపై ప్రయాణం నరకప్రాయం



గోతుల మయంగా ఉన్న రహదారిని పెకిలించి కొత్త రోడ్డుకై కంకర వేయడం జరిగింది. హమ్మయ్యా రోడ్డు వేస్తున్నారులే అనుకుంటే అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎప్పుడో వేసిన రోడ్డుకు మరమ్మతులు చేస్తుంటే ఆపివేయమని చెప్పడం ప్రజలను కష్టాల పాలు చేసినట్లే. వెంటనే అనుమతులు ఇచ్చి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలి.
– నాగార్జున, వేంపెంట

అనుమతులు తప్పనిసరి



అడవి పరిధిలో రహదారుల నిర్మాణాలకు తప్పని సరి అనుమతులు ఉండాలి. టెక్నికల్ సమస్య వలన పనులు నిలిపివేయడం జరిగింది. పంచాయతీరాజ్ శాఖ వారు గతంలో రహదారి నిర్మాణాలకు సంబంధించిన రికార్డులు తీసుకువస్తామన్నారు. ఆ తరువాత తగు చర్యలు తీసుకుంటాం.
–అలెన్ చాంగ్ టెరాన్, డీఎఫ్ఓ, ఆత్మకూరు

త్వరలో సమస్య పరిష్కరిస్తాం



గతంలో ఉన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాం. అయితే ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేవని పనులు నిలిపివేయమన్నారు. పనులు కొనసాగించాలని డీఎఫ్ఓకు లెటరు ఇచ్చాం. అప్పట్లో నిర్మాణం చేపట్టిన నాటి రికార్డులు వెతుకుతున్నాము. త్వరలో సమస్యను పరిష్కరించి నిర్మాణ పనులు చేపడతాం.
– ధనిబాబు, డీఈఈ, పంచాయతీరాజ్, నందికొట్కూరు

షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి మంజూరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు మండల ముస్లీం మైనార్టీ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ బుధవారం తెలిపారు. సున్నిపెంటలోని స్టేట్‌బ్యాంక్ వద్ద షాదీఖానాకు పాతభవనం ఉండేదని అది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ విషయాన్ని గత ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలిపినప్పటికీ షాదీఖానా మరమ్మతులకు గానీ, పునర్నిర్మాణానికి గానీ ఎవరూ సహకరించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక శ్రీశైలం శాసన సభ్యులు శిల్పాచక్రపాణిరెడ్డి స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారని చెప్పారు. ప్రభుత్వం ద్వారా రూ.కోటి మంజూరు చేయించేందుకు ఆయన చేసిన కృషిని శ్రీశైలం మండల ముస్లిం మైనార్టీలు ఎన్నటికీ మరువరన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన వైద్యసేవలు



పెద్దగుమ్మడాపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య బృందం

కొత్తపల్లి: మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డాక్టర్ జబీర్ అన్నారు. బుధవారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు బీపీ, షుగర్, జ్వరము, ఒళ్లనొప్పులు, ఇతరత్ర వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించడం కోసం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



అధికారులు, ప్రజాప్రతినిధులకు సలహాలు, సూచనలు ఇస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

జూపాడుబంగ్లా: అధికారులు మండల సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఈఓ సభ నిర్వహణను ఆద్యంతం పర్యవేక్షిస్తూ సభ్యులు, అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పలువురు ప్రజా ప్రతినిధులు తమ పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. అనంతరం మండల పరిషత్ భవనం మరమ్మతుల కోసం కేటాయించిన రూ.6లక్షల నిధుల రద్దు, ఫెస్టివల్ కమిటీల నియామకపు కమిటీల రద్దు తీర్మానాలను సభలో ప్రవేశపెట్టగా ఎంపీటీసీ సభ్యులు వాటిని వ్యతిరేకించటంతో రెండూ వీగిపోయాయి.

సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోండి

సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే వాటిని తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. అలాకాకుండా నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు వాగ్వివాదం చేసుకోవటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్ ఎంపీపీలు రమణమ్మ, తోకల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

మహిమాన్వితం మహానంది క్షేత్రం



మహానందీశ్వరుడి సన్నిధిలో పీఠాధిపతి కృష్ణస్వామి

మహానంది: మహానంది క్షేత్రం ఎంతో మహిమాన్వితమని, స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి మహిమాన్వితుడని విజయవాడ శ్రీ దుర్గాపీఠం, శ్రీ కృష్ణదుర్గ సాధన నిలయం పీఠాధిపతి కృష్ణస్వామి అన్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం బుధవారం ఆయన తన శిష్యులతో కలిసి మహానంది వచ్చారు. స్వామి,అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దైవారాధన ద్వారా మనిషికి ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెరుగుతాయన్నారు. హిందూ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు.

వైభవంగా రాహుకేతు విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



విగ్రహాలకు విశేష పూజలు చేస్తున్న పండితులు

మహానంది: దక్షిణ భారతదేశంలో ప్రముఖ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న మహానందిలో రాహుకేతు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, రాహుకేతు మండప నిర్మాణ దాతలు బాబ్జీ, జర్నలిస్ట్ హరికిషన్, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, కంకణధారణ, పంచగవ్య ప్రాశన, యజమానుల కంకణ ధారణ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన రాహుకేతు విగ్రహాలకు కంకణధారణ చేసి ఆలయ ప్రదక్షిణతో రాహుకేతు మండపం వరకు చేరుకుని మూలమంత్ర అనుష్ఠానములు నిర్వహించారు. రాత్రి మృత్సంగ్రహణం, అంకురార్పణ, ప్రధాన కలశ స్థాపన, నవగ్రహ, క్షేత్రపాలక, యోగిని, వాస్తు, సర్వతోభద్ర మండపముల ఆవాహన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం రాహుకేతు విగ్రహ మూర్తులకు జలాధివాసం పూజలు వైభవంగా జరిగాయి. విగ్రహ, కాలసర్పయంత్ర ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాల్లో సూపరింటెండెంట్లు వెంకటేశ్వరుడు, శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమాత కరుణ అందరిపై ఉంటుంది



భక్తురాలికి బైబిల్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: శ్రీ ఆరోగ్యమాత కరుణ అందరిపై ఉంటుందని ఆర్‌సీఎం చర్చి మేత్రాసన రెవరెండ్ మోన్‌సిగ్నోర్ అంతోనప్ప చౌరప్ప అన్నారు. బుధవారం పట్టణంలోని నందికొట్కూరు విచారణ పరిధిలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో జరుగుతున్న మేరిమాత తిరునాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలనాధికారి మాట్లాడుతూ మేరిమాత చల్లని మాతగా పిలువబుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిపై మాత చల్లని చూపుతో రోగం మాయమవుతుందని చెప్పారు. వేళాంగిణిమాతను కొలిచిన వారికి కొంగుబంగారమవుతుందని స్పష్టం చేశారు. అనంతరం చర్చిలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి క్రైస్తవులకు బైబిళ్లను పంపిణీ చేశారు. జిల్లా శాప్ కోఆర్డినేటర్ స్వామిదాసు రవికుమార్, కౌన్సిలర్లు లాలు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, ఆర్టీసీ బాబు, బ్రహ్మయ్య, చరణ్, తదితరులు ప్రార్థనలో పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ కృషి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- రూ. 2.81కోట్లతో నిర్మించిన పార్నపల్లె - యర్రగుంట్ల రహదారి ప్రారంభం



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఘన స్వాగతం పలుకుతున్న పార్నపల్లె గ్రామస్తులు

మహానంది: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలో మండల నాయకులు, గ్రామస్తులు గజమాలలు, పుష్పాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని, పార్నపల్లె నుంచి యర్రగుంట్ల వరకు కాకనూరు మీదుగా రూ. 2.81 కోట్లతో నిర్మించిన రహదారిని ప్రారంభించారు. అనంతరం శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ సంక్షేమ రాజ్యాన్ని స్థాపిస్తున్న సీఎం జగన్‌కు ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తుందన్నారు. ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందడంతో మాకు సీఎంగా మళ్లీ జగనన్నే కావాలంటూ లబ్ధిదారులే సంతోషంగా చెబుతున్నారన్నారు. గ్రామంలో పలువురు తమ సమస్యలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులను పిలిచి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, మాజీ ఎంపీపీ దేసువెంకట్రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాగాల వెంకటరమణ, గొర్రెల పెంపకందారుల సంఘం కన్వీనర్ కాకనూరు సుబ్బయ్యయాదవ్, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, నాయకులు కడిపిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.75వేలు విరాళం

బండిఆత్మకూరు మండలం కాకనూరులో నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండరామస్వామి ఆలయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ. 75వేలు విరాళం అందించినట్లు నాయకులు సుబ్బారెడ్డి, శివారెడ్డి తెలిపారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధులు, ఎస్టీ కాలనీ వాసులు ఎమ్మెల్యే శిల్పాకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్నపల్లె గ్రామంలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు తన వంతుగా ప్రోత్సాహక బహుమతులు అందించి ప్రోత్సహించారు. తన పిల్లలకు విద్య అందించాలని తల్లిదండ్రులు కోరగా తన వంతుగా కళాశాలల్లో రాయితీ ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.

ఘనంగా గ్రామోత్సవం



గంగమ్మ దేవతకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో బుధవారం గంగమ్మ దేవతా విగ్రహానికి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గంగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మేళతాళాలు, బాజా భజంత్రీలతో పుర వీధుల వెంట ఊరేగింపు చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి చీర, సారె, పసుపు, కుంకుమ, కాయ కర్పూరాలు సమర్పించి పూజించారు. అంతకు మునుపు పురోహితులు విశేషపూజలు చేశారు.

రేపు బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వెలుగోడు: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన బి.సి. విద్యార్థులకు జాతీయ బి.సి.సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్ తెలిపారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ పి నాగశేషులు, పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని వేంపెంట రస్తాలో మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్కడే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. బి.సి.పట్టణ కమిటీ సభ్యులు, అన్ని గ్రామాల బీసీలు, విద్యావంతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీమా పథకాలు కూలీలకు ఉపయోగకరం

కొత్తపల్లి: ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు ఉపాధి కూలీలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రత్యేకాధికారి దాసు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉపాధికూలీలు ప్రమాద వశాత్తు మరణిస్తే వాటి కుటుంబాలకు ఈ రెండు పథకాల ద్వారా ఆర్థిక వెసులుబాటు లభిస్తుందన్నారు. సిబ్బంది ప్రతి కూలీకి ఈ రెండు పథకాలు వర్తింపచేసేలా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. దీనికి 18 నుంచి 70 సంవత్సరాల లోపు వయసున్నవారు అర్హులన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజునాయక్, ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

పగిద్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోటలో తెలంగాణ మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగార్జున బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన దూదేకుల దర్బార్ అనే వ్యక్తి అక్రమార్జనకు అలువాటు పడి తెలంగాణ నుంచి మద్యం తెచ్చి వ్యాపారం చేయసాగాడన్నారు. మంగళవారం రాత్రి చికెన్ ముత్తు అంగడి వద్ద మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని వెల్లడించారు. ఈ దాడిలో అతని వద్ద 180 ఎంఎల్ తెలంగాణ మద్యం లిక్కర్ బాటిల్స్ 270 లభ్యం కాగా ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని తెలిపారు.

పీవీ రావు సేవలు మరవలేనివి

నందికొట్కూరు: మాలల ఆశా జ్యోతి పీవీ రావు సేవలు మరవలేనివని మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఆ సంఘం వ్యవస్థాపకుడు పీవీ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ నాయకులు పీవీ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. వారు మాట్లాడుతూ ఏబీసీడీలుగా ఎస్సీలను వర్గీకరణ చేసిన అప్పటి చంద్రబాబు ప్రభుత్వానికే ఎదురొడ్డి నిలిచి పోరాడినా ఏకైక వ్యక్తి పీవీ రావు అని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, నాగేంద్ర, హుసేనాకం, రవి, ఎం. రవి తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి



ఉపాధ్యాయులకు రాగిజావ గ్లాసులను అందజేస్తున్న ఎంఈఓ సుభాన్

పగిద్యాల: బడిబయటి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి నివేదికలు పంపాలని ఎంఈఓ సుభాన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. బుధవారం స్థానిక విద్యాధికారి కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో 3, 4, 5 తరగతులు చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం తెలుగు, గణితం పుస్తకాలను టీచింగ్ అట్ రైట్ లెవెల్ కార్యక్రమం కింద మంజూరు చేసిందన్నారు. నాడు– నేడు పనులను సకాలంలో పూర్తి చేయించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న కిట్లు విద్యా శాఖ కార్యాలయానికి మంజూరు అయ్యాయని వెల్లడించారు. మొదటి విడుత కింద 11,637 పాఠ్యపుస్తకాలు, 3,504 యూనిఫాం దుస్తులు 3,504, రాగి జావ తాగేందుకు 3,057 గ్లాసులు, 965 తర్ల్ సామగ్రి వచ్చాయని తెలిపారు. అనంతరం తర్ల్ మెటీరియల్‌ను, రాగి జావ గ్లాసులను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, శివరామయ్య, చంద్రశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.